పేద విద్యార్థులపై భారం



నేను పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుకుంటున్నాను. మా తల్లిదండ్రులకు వ్యవసాయం జీవనాధారం. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ఫీజులు తక్కువగా ఉంటాయి. చదువుకునేందుకు వీలుగా ఉంటుంది. ప్రైవేట్ పరం చేస్తే మాలాంటి పేద విద్యార్థులపై ఫీజుల భారం తడిపి మోపెడువుతుంది. దీంతో పేద విద్యార్థులకు వైద్య విద్య అందకుండా పోతుంది.

– చంద్రిక, బైపీసీ విద్యార్థి, పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏర్పేడు మండలం



కల నెరవేరేనా



మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. మా తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. ఇంటర్మీడియట్ బైపీసీ ప్రథమ సంవత్సరంలో 440 మార్కులకు గాను 429 మార్కులు సాధించాను. నీట్ పరీక్ష రాసి ఎంబీబీఎస్ చేయాలనుకుంటున్నాను. ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయాలనే యోచిస్తోంది. మాలాంటి పేద విద్యార్థులు వైద్య విద్యను అందుకోలేక కలగానే మిగిలిపోతుంది.

– గౌతమి, బైపీసీ విద్యార్థి, పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏర్పేడు మండలం.

క్లుప్తంగా

వేగంగా ఇంటింటి ఓటర్ల సర్వే


మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : ఇంటింటి ఓటర్ల సర్వే వేగంగా నిర్వహించాలని కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. మంగళవారం తిరుపతి నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో సూపర్ వైజర్లు, అసిస్టెంట్ సూపర్ వైజర్లతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇంటింటి ఓటర్ల సర్వేను ఆలస్యంగా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్ల జాబితాలో తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఎవరైనా మరణించారా? ఇల్లు మారారా? చిరునామాలో మార్పులు ఏమైనా ఉన్నాయా? తదితర వివరాలు సేకరించాలని స్పష్టం చేశారు. , అత్యంత అప్రమత్తంగా ధ్రువీకరణ పత్రాలు పరిశీలించాలని కోరారు. చిన్నపాటి తప్పులు దొర్లినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, డీటీ జీవన్ పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు తగవు

తిరుమల : శ్రీవారి దర్శనార్థం వేచి ఉన్న సమయంలో అన్నప్రసాదాలు, పాలు ఇవ్వలేదని మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఓభక్తుడు ఫిర్యాదు చేయడంపై తక్షణం విచారణ చేపట్టామని టీటీడీ ఈఓ శ్యామలరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సీసీ ఫుటేజీని పరిశీలిస్తే అసలు విషయం బయటపడిందన్నారు. అధిక సమయం క్యూలో ఉండడం వల్ల తప్పుడు ఫిర్యాదు చేసినట్లు ఒప్పుకున్నాడని వివరించారు. టీటీడీ సిబ్బంది ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా అసత్య ఆరోపణలు చేయడం భక్తులకు తగదని సూచించారు.

ఉద్యోగాలకు దరఖాస్తులు

తిరుపతి(అలిపిరి): శ్రీ లక్ష్మి శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన శ్రీ పద్మావతి చిన్నపిల్లల హాస్పిటల్‌లో పనిచేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంస్థ సీఈఓ ఎం.గౌతమి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ కో–ఆర్డినేటర్, ఎకో టెక్నీషియన్, అనస్తీషియా టెక్నీషియన్, సీనియర్ ఫిజీషియన్ అసిస్టెంట్, జూనియర్ ఫిజీషియన్ అసిస్టెంట్, పెర్ఫ్యూజన్ టెక్నాలజిస్టు పోస్టులకు అక్టోబర్ 1వ తేదీ ఉదయం 9 నుంచి 12 గంటల లోపు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు http://slsmpc.in/ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

సాయి మందిరం హుండీ లెక్కింపు


కానుకల లెక్కిస్తున్న దృశ్యం

తిరుపతి కల్చరల్ : కొంకా వీధిలోనిశ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో మంగళవారం హుండీ లెక్కింపు చేపట్టారు. ఈ మేరకు రూ.6.50,380ల ఆదాయం వచ్చిందని షిరిడీ సాయిబాబా సేవా సమాజ్ ప్రతినిధులు మబ్బు దేవనారాయణరెడ్డి, కుడితి సుబ్రమణ్యం తెలిపారు. కార్యక్రమంలో సేవా సమాజ్ సభ్యులు బాలకృష్ణ, దుర్గం శ్రీనివాస్, మర్దం శివ, సి.రమేస్, పి.రాజామణి అమ్మ పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదు

పాకాల : మండలంలోని జక్కదన గ్రామంలో ఉన్న తమ భూమిని అక్రమంగా వేరొకరికి రిజిస్ట్రేషన్ చేశారని బాధిత కుటుంబీకులు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ హేమంత్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. వెదురుకుప్పం మండలం గంటావారిపల్లెకు చెందిన దామోదర్‌రెడ్డి కుటుంబసభ్యులు మాట్లాడుతూ సర్వే నంబర్ 513–16లో తమకు చెందిన 66 సెంట్ల భూమిని రెవెన్యూ, సబ్ రిజిస్టార్ కార్యాలయ సిబ్బంది, ఓ డాక్యుమెంట్ రైటర్ కలసి పుల్లారెడ్డి అనే వ్యక్తి కుమారుడి పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో సర్వే నెంబర్లు, రికార్డులు లేకుండా మాయం చేశారని వాపోయారు. దీనిపై స్పందించిన ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ రికార్డులు పరిశీలించారు. రికార్డుల మేరకే రిజిస్ట్రేషన్ జరిగిందని స్పష్టం చేశారు.

రేపటి నుంచి క్రీడాపోటీలు

రామచంద్రాపురం: మండలంలోని నెత్తకుప్పం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 19వ తేదీ నుంచి మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు, జయవేలు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన అండర్–14, 17 కేటగిరీలకు చెందిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, బ్యాడ్మింటన్, అథ్లెటిక్ క్రీడాకారులు పాల్గొనన్నట్లు చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు. క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో రావాలని సూచించారు. కార్యక్రమంలో మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ రామకృష్ణ, హెచ్‌ఎం తులసీకుమారి పాల్గొన్నారు.

తిరుపతి గంగమ్మకు విశేష పూజలు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపై వెలసిన తిరుపతి గంగమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ధర్మకర్తలు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం

- ఆధ్యాత్మిక క్షేత్రంలో ఆకర్షణీయంగా పార్కులు
- పిల్లలను ఆకట్టుకునేలా పరికరాలు
- వేకువ నుంచే సందడి చేస్తున్న వాకర్లు

ప్రకాశం పార్కు



నగరవనంలో వాకింగ్ చేస్తున్న ప్రజలు

తిరుపతిలోని పార్కులు నగరవాసులకు ఆహ్లాదం పంచుతున్నాయి. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తోడ్పాటునందిస్తున్నాయి. ఫిట్‌నెస్ పెంపొందించుకునేందుకు దోహదపడుతున్నాయి. పని ఒత్తిడిలో అలిసిన వారిని సేదతీరుస్తున్నాయి. పిల్లల ఆటపాటలకు ఆలవాలంగా నిలుస్తున్నాయి. సీనియర్ సిటిజన్లను ఉల్లాసపరుస్తున్నాయి. యువతను ఉత్తేజపరుస్తున్నాయి. క్రీడాకారులను ఉత్సాహపరుస్తున్నాయి. వేలాదిమందికి స్వచ్ఛమైన ప్రాణవాయువును అందిస్తున్నాయి. ప్రధానంగా పర్యావరణ ప్రేమికులను మరింతగా మురిపిస్తున్నాయి. అందుకే నగరంలోని ప్రకాశం పార్కు.. జంగిల్ పార్కు.. పద్మావతి పార్కు.. జగ్జీవన్‌రామ్ పార్కు.. వినాయకసాగర్.. నగరవనం.. టీటీడీ పరిపాలన భవనం వద్ద పార్కులు నిత్యం సందర్శకులతో కళకళలాడుతున్నాయి.

– తిరుపతి (అలిపిరి)




నగరవనవంలోని ఓపెన్ జిమ్‌లో వ్యాయామం, యోగా చేస్తున్న పిల్లలు, పెద్దలు,

ఎంతగానో ఆకర్షిస్తోంది



నేను 15 ఏళ్లకు పైగా నిద్ర లేవగానే నగరవనంలో నడక కోసం వస్తున్నా. నా దైనందిన జీవితంలో వాకింగ్‌ను అలవాటుగా చేసుకున్నా. ఇక్కడి చెట్ల నుంచి వచ్చే స్వచ్ఛమైన ఆక్సిజన్ పీల్చుకునే అవకాశం లభిస్తోంది. నగరవనంలో మరింతగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. దీంతో వాకర్స్‌తోపాటు పిల్లలు, క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగకరం. ఇక్కడి వాతావరణం ఎంతగానో ఆకర్షిస్తోంది.

– బాబునాయుడు, వాకర్, తిరుపతి

ప్రశాంతంగా ఉంది



నేను ఎంఎస్సీ చదువుతున్నా. ప్రతిరోజూ పార్కులో వ్యాయామం..యోగాసనాలు చేయడంతోపాటు వాకింగ్ చేస్తా. ఇంటి వద్ద కంటే పార్కుల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో వాకింగ్ చేయడం ద్వారా మైండ్ ప్రశాంతంగా ఉంటోంది. దీంతో నేను మంచిగా చదువుకోగలుగుతున్నా. చదివింది గుర్తుంటోంది. నేను గత మూడు నెలల నుంచి వాకింగ్ చేయడంతో మంచి ఫలితం పొందుతున్నా.

– సోనియా, విద్యార్థిని, తిరుపతి

వ్యాయామం చేయాలి



నేను 2008 నుంచి నగరవనంలో వాకింగ్, వ్యాయామం చేస్తున్నా. 60 ఏళ్లకు పైడినా ఇప్పటికీ ఆరోగ్యంగా ఉంటున్నా. ప్రతిఒక్కరూ నగరంలోని పార్కులను సద్వినియోగం చేసుకోవాలి. యువత ప్రధానంగా సెల్‌ఫోన్లకు బానిసలై మైదానాల్లోనూ.. పార్కుల్లో కనిపించడం కరువైంది. ప్రతిఒక్కరూ వ్యాయామం, యోగా తప్పనిసరిగా చేయాలి. నగరవనంలో కుంటలు ఉన్నాయి. అటవీశాఖ అధికారులు స్పందించి ఈ కుంట్లో నీరు నింపితే పక్షుల దాహార్తిని తీర్చు కుంటాయి.

– కేఆర్‌ఎం నాయుడు, వాకర్, తిరుపతి

రీఫ్రెష్ అవుతా



ఉద్యోగ రీత్యా నిత్యం ఒత్తిడిలో ఉంటాం. అందుకే ప్రతి రోజూ ఉదయందివ్యారామం చేరుకుని ఎంతో ఆహ్లాదకర వాతావరణంలో వాకింగ్, వ్యాయామం చేస్తుంటా. దీంతో మైండ్ పూర్తిగా రీఫ్రెష్ అవుతుంది. ఇక్కడ మంచి గాలిని ఆస్వాదించే అవకాశం ఉంటోంది. కొన్నేళ్లుగా రోజూ పార్కులో ఎ వాకింగ్ చేయడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందుతున్నా. ఉద్యోగాన్ని సైతం ఉత్సాహంగా చేయగలుగుతున్నా.

– శ్రీలక్ష్మి, ఉద్యోగి, తిరుపతి

ఉత్సాహంగా ఉంది



నేను తిరుపతిలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తున్నా. ప్రతిరోజూ నగరవనం చేరుకుని యోగా చేస్తున్నా. ఇక్కడ ఏర్పాటు చేసిన యోగా మందిరం అందరికీ ఎంతో ప్రశాంతతను అందిస్తూ ఎంతగానో ఉపయోగకరంగా ఉంది. అలాగే పచ్చని చెట్ల నడుమ.. మంచి గాలిని పీలుస్తూ వ్యాయామం చేస్తున్నా. ప్రధానంగా మట్టిరోడ్డుపై నడవడం బాగుంది. అలాగే ఇక్కడ ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడంతో ప్రతిఒక్కరికీ ఉత్సాహంగా ఉంది.

– సుమలత, ఉద్యోగిని, తిరుపతి

మొక్కలకు నీళ్లందిస్తున్నా..!



దివ్యారామంలోని పక్షులు, మొక్కలను కాపాడేందుకు నీటిని అందిస్తున్నా. మొక్కలను నాటి నీటిని పోస్తూ కాపాడేందుకు ప్రయత్నిస్తూ ఉన్నా. ఈ పని చేయడం వల్ల నేను ఆరోగ్యంగా ఉంటున్నా. అలాగే కొన్ని చోట్ల ఖాళీ స్థలాలు ఉన్నాయి. అక్కడ మొక్కలు పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు, యోగా మందిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాసులు, నాటు వైద్య నిపుణుడు, తిరుపతి

శ్రీవారి సేవలో ప్రముఖులు


ఎంపీ గురుమూర్తి

తిరుమల : తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో మాజీ గవర్నర్ నరసింహన్, ఎంపీ గురుమూర్తి, మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సమంత ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

అంతర పంటలతో ఆదాయం

పాకాల : మామిడిలో అంతర పంటలను సాగు చేయడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని చంద్రగిరి ఉద్యాన శాఖ అధికారి శైలజ తెలిపారు. మంగళవారం మండలంలోని మొగరాల పరిసర ప్రాంతాల్లో ఉన్న మామిడి తోటలను పరిశీలించారు. అంతర పంటగా టమాట సాగు చేస్తే మంచి ఆదాయం పొందవచ్చని, మల్చింగ్ షీట్లు ఉపయోగిస్తే చీడపీడల నుంచి రక్షణ పొందవచ్చని సూచించారు. కూరగాయ పంటలకు 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఏఏ రోహిత్ పాల్గొన్నారు.

అంబులెన్స్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



తనకల్లు: సత్యసాయి జిల్లా చీకటిమానిపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్ బాబ్‌జాన్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. తిరుపతికి చెందిన బాబ్‌జాన్ అంబులెన్స్ వాహనానికి డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం తెల్లవారుజామున తిరుపతి నుంచి అంబులెన్స్‌లో మృతదేహాన్ని కొక్కంటి క్రాస్‌కు తీసుకొచ్చాడు. తిరుగు ప్రయాణంలో చీకటిమానిపల్లి దగ్గరకు రాగానే గుర్తు తెలియని వాహనం అంబులెన్స్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బాబ్‌జాన్ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు తమ అంబులెన్స్‌లో క్షతగాత్రుని మదనపల్లె ఆస్పత్రికి తరలించారు.

పేదలకు అన్నదానం

తిరుపతి కల్చరల్ : ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజును పురస్కరించుకొని బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం వద్ద పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కల్యాణి, పున్నమినాటి సుబ్రమణ్యంరెడ్డి, బాబు, ఫణి భూషణరెడ్డి, సునంద పాల్గొన్నారు.అలాగే బీజేపీ యువమోర్చా నేత వెంకటాద్రి యాదవ్ ఆధ్వర్యంలో రుయా ఆస్పత్రి వద్ద 500 మందికి అన్నదానం చేశారు. నేతలు చంద్రబాబు యాదవ్, భాస్కర్‌రావు, రాజేంద్ర నాయుడు, హేమంత్, పగడాల ఉత్తన్న పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న ట్రస్ట్ చైర్మన్ పీసీ రాయులు

కస్తూర్బాగాంధీ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

తిరుపతి కల్చరల్ : ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా కస్తూర్బా గాంధీ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీ రోడ్డులో పీసీ రాయులు మంగళవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, నేతలు భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా 'తమ్ముళ్ల'కు క్యాంటీన్

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని క్యాంటీన్‌ను కొటేషన్, టెండర్‌తో పనిలేకుండా టీడీపీ శ్రేణులకు కట్టబెట్టేశారు. గతంలో క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నవారి టెండర్ కాల పరిమితి ముగియడంతో వర్సిటీ అధికారులు గుట్టు చప్పుడు లేకుండా నారావారపల్లెకు చెందిన తెలుగు తమ్ముళకు అప్పగించేశారు. అలాగే వర్సిటీలో జెరాక్స్ సెంటర్‌ను సైతం టీడీపీ కార్యకర్తలకు తాంబూలంగా అందించేశారు. ఈవిషయం వర్సిటీలో చర్చనీయాంశమైంది.

పరిశుభ్రత.. అందరి బాధ్యత



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్టీసీ ఈడీ

తిరుపతి తుడా : పవిత్ర తిరుపతిని పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యతని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, కమిషనర్ మౌర్య తెలిపారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మహిళా వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, ఏఎస్పీ రవి మనోహరాచారి, డీఎంహెచ్‌ఓ శ్రీహరి, టూరిజం అధికారి రమణ ప్రసాద్, సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ, ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో..

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కడప జోన్–4 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని గ్యారెజ్ వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. స్వచ్ఛత హి సేవ పక్షోత్సవాల్లో భాగంగా చేపట్టాల్సిన అంశాలను వివరించారు. డీఎం బాలాజీ, అసిస్టెంట్ మేనేజర్ వేణు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో..

తిరుపతి(అలిపిరి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, సీఐ మధుసూదన్ పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి : పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన అవసరమని పంచాయతీ ఈఓ మహేశ్వరయ్య తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులతోర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

భాకరాపేటలో..

భాకరాపేట : స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడం అవసరమని ఇన్‌చార్జి ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. సర్పంచులు సాకిరి భూపాల్, విమల, మాధవి, శశిప్రియ, విజయ్ కుమార్, మనోహర్, కార్యదర్శులు మదనమోహనరాజు, మోహన్‌రెడ్డి, సతీష్, నాగమణి పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల : స్వచ్ఛతా హీ సే వా కార్యక్రమాలను విధిగా నిర్వహించాలని జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజా రెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నుంచి ఆర్టీసీ బస్‌స్టాండ్ వరకు అధికారు లు, ప్రజాప్రనిధులు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ ప్రభాకర్, తహసీల్దార్ నిత్యానందబాబు, ఈఓపీఆర్‌డీ మాలతి పాల్గొన్నారు.

రుయాలో రోగి భద్రతా దినోత్సవం

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రిలో మంగళవారం రోగి భద్రతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ చంద్రశేఖర్, రుయా సూరింటెండెంట్ మాట్లాడుతూ రోగి సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు.

108 అంబులెన్స్ సర్వీసులో ఉద్యోగాలు

తిరుపతి తుడా : 108 వాహనాల్లో పైలట్ (డ్రైవర్) పోస్టులకు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి 108 సర్వీస్ జిల్లా మేనేజర్ సంజీవ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణత, హెవీ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. 6 నెలల వ్యవధిలో హెవీ లైసెన్సు కలిగి ఉండి, 35 ఏళ్లలోపు వయసు, ఇంగ్లిష్ చదవడం, రాయడం తెలిసి ఉండాలన్నారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టుకు బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ తదితర కోర్సులు చేసి ఉండాలని తెలిపారు. తిరుపతి మధురానగర్‌లోని 108 సర్వీసెస్ జిల్లా కార్యాలయంలో గానీ, 7032382246 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

చంద్రగిరి: మండలంలోని నరసింగాపురం స్వర్ణముఖి నదిలో నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్ శివరామ సుబ్బయ్య ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు మంగళవారం దాడులు చేసి పట్టుకున్నారు. ఇసుక లోడుతో సిద్ధంగా ఉన్న నాలుగు ట్రాక్టర్లను అధికారులు స్వాధీనం చేసుకుని, తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఇదిలా ఉండగా గత కొద్ది రోజులుగా రాత్రి వేళ అక్రమంగా ఇసుకను తరలిస్తున్న అసలైన స్మగ్లర్లను పట్టుకోకుండా అధికారులు వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యక్రమంలో వీఆర్‌ఓలు విజయ్ కుమార్, హరి, వాసయ్య, పురుషోత్తం తదితరులు దాడుల్లో పాల్గొన్నారు.

ఎస్వీయూ ఉద్యోగుల విరాళం

తిరుపతి సిటీ : విజయవాడ వరద బాధితులకు ఎస్వీయూ ఉద్యోగులు రూ.47లక్షల విరాళం అందించారు. మంగళవారం ఈ మేరకు అమరావతిలో మంత్రి నారా లోకేష్‌కు వర్సిటీ ఇన్‌చార్జి వీసీ అప్పారావు చెక్ అందజేశారు.

క్యాన్సర్ వైద్య శిబిరం

తిరుపతి కల్చరల్ : రాస్ మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో టాటా ట్రస్ట్ సహకారంతో మంగళవారం భవానీ నగర్‌లో మహిళలకు ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. ట్రస్ట్ ప్రతినిధి హేమంత్‌కుమార్ మాట్లాడు తూ క్యాన్సర్ పట్ల అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. రాస్ సిబ్బంది మంజుల, సుహాసిని, పుష్పాంజలి, రాధిక, శ్రీలక్ష్మి, విజయ, గిరి పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

తిరుపతి కల్చరల్ : పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని మెకానిక్ షాపుల యజమానులను లేబర్ కమిషనర్ లల్లప్ప, అధికారులు లక్ష్మీనారాయణ, రాజయ్య, ప్రసాద్ హెచ్చరించారు. ఈమేరకు మంగళవారం తిరుపతి టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అవుల మునిరెడ్డికి కార్మిక శాఖ చట్టం నిబంధనల కరపత్రం అందజేశారు.

ఆర్‌ఓ ప్లాంట్లు ప్రారంభం

రామచంద్రాపురం: మండలంలోని పీవీపురం పంచాయతీ బలిజపల్లె, మిట్టూరు ఏఏడబ్ల్యూ, సి.రామాపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్లను ఎమ్మెల్యే పులివర్తి నాని మంగళవారం ప్రారంభించారు. అనంతరం పొలంబడి పోస్టర్ ఆవిష్కరించారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

తిరుపతి కల్చరల్: విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాస్ భవన్‌లో శ్రీమద్విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా పూజా యజ్ఞమహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వకర్మ జెండా ఆవిష్కరించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ కలశాల ఊరేగింపు చేపట్టారు. విశ్వకర్మ ఉత్సవమూర్తికి విశ్వబ్రాహ్మణ వేద పండితులు అభిషేకం చేశారు. 11 మంది దంపతులతో వేదమంత్రోత్సణల నడుమ యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనినవాసులు, టీడీపీ నేత నరసింహయాదవ్, బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి విశ్వకర్మకు పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మనోహర్ ఆచారి, జిల్లా అధ్యక్షుడు తిరుమల ఆచారి, ప్రధాన కార్యదర్శి ఉమాపతి ఆచారి, నాయకులు నాగేశ్వరాచారి, కుప్పలింగమాచారి, అశోక్ ఆచారి, ప్రసాద్ ఆచారి, అన్నామలై, శ్రీమంతుల రామయ్య, బాలకృష్ణ, సుబ్రమణ్యం , శంకరాచారి పాల్గొన్నారు.

నేడు ఎల్లమ్మ ఆలయ ఆదాయ వనరుల వేలం

చంద్రగిరి : గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయ ఆదాయ వనరులకు బుధవారం వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పుట్టా రామకృష్ణా రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జనవరి 1 2024 నుంచి 2025 సెప్టెంబర్ 30 వరకు భక్తులు సమర్పించే తలనీలాలు, వస్త్రాలు, కొబ్బరి చిప్పలు సేకరించే హక్కు, పూజా సామాగ్రి విక్రయించేందుకు ఆలయ ఆవరణలో బహిరంగ వేలం జరుగుతుందని వివరించారు.

శెట్టిపల్లె భూ సమస్యపై సమీక్ష

తిరుపతి అర్బన్ : శెట్టిపల్లెలోని భూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్యతో కలసి శెట్టిపల్లె భూ పరిరక్షణ సమితి ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని, మూడు వారాలు లోపు నివేదిక అందజేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీఓ నిషాంత్ రెడ్డి, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, డీటీ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన

తిరుపతి మంగళం : శెట్టిపల్లి భూ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కమిషనర్ మౌర్య క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించారు. త్వరలోనే ప్లాట్లు కొనుగోలు చేసిన వారు వారి స్థలాల్లో ఇల్లు కట్టుకునేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.